క్లుప్తంగా

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా


మాట్లాడుతున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: ప్రజలు రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తెలిపారు. మున్సిపల్ పరిధిలో శనివారం ఆయన పలు కాలనీలను సందర్శించారు. అనంతరం మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఎవరైనా రోడ్లపై మురుగు కాలువల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన సుల్తానాబాద్ మున్సిపల్‌ను స్వచ్ఛ మున్సిపల్‌గా తీర్చిదిద్దేందుకు చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్ కౌన్సిలర్లతో కలిసి సమష్టి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. నిత్యం ఆర్పీలు పర్యవేక్షిస్తారని చెత్త వేసిన వారి ఫొటోలు తీసి వారి గృహాలకు మున్సిపల్ సిబ్బంది వెళ్లి జరిమానా విధిస్తారన్నారు. ప్రజలందరూ చెత్తరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని కోరారు.

ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ బహూకరణ

సుల్తానాబాద్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో 1995–96లో పదో తరగతి చదివిన బ్యాచ్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి చేతుల మీదుగా బహూకరించారు. ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్ మరమ్మతుకు గురైతే వాటి ఖర్చుకు అడ్వాన్సుగా రూ.10వేల నగదు హెచ్‌ఎంకు అందజేశారు.

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా సాకేత్

యైటింక్లయిన్‌కాలనీ: జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా కాలనీకి చెందిన ఇజ్జగిరి సాకేత్ ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బసంత్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుగ్గక్రాస్ రోడ్ వద్ద ప్రధాన రహదారిపై శనివారం బసంత్‌నగర్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాలను ఆపి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు పరిశీలించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వాహనదారుడు సరైన పత్రాలను పూర్తిస్థాయిలో కలిగి ఉండాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్లు శివకుమార్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన కుంట రమేశ్ ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుమారుడు వాయుపుత్ర ఆటో యూనియన్‌లో తనకు ఉన్న ఆటో నడుపుతున్నాడు. తోటి ఆటో డ్రైవర్ తండ్రి మరణించిన విషయాన్ని తెలుసుకుని వాయుపుత్ర ఆటో యూనియన్ తరపున కుంట కార్తీక్‌కు రూ.10వేలు అందించారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఎండీ.చాంద్‌పాషా, మేకల కుమార్, అల్లంకి అశోక్, మద్రి సురేశ్, అల్లెంకి శంకర్, చల్ల చంద్రమొగిలి, అంబటి నరేశ్, దుగ్యాల సతీశ్ పాల్గొన్నారు.

అంతర్గాం పరిధిలో వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఎస్సై సంతోష్‌కుమార్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ రహదారిలో శనివారం అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను సోదా చేశారు. ఇటీవలి కాలంలో వాహనాల్లో గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా అవుతున్న నేపథ్యంలో ఆకస్మిక సోదాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పొత్కపల్లి పరిధిలో..

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాంసానిపల్లె, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో ఏఎస్సై లక్ష్మీరాజం ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట గ్రామాల వైపునకు వెళ్లే పలు అనుమతిపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి


సుల్తానాబాద్‌లో జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ చౌరస్తాలో..


కమాన్‌పూర్‌లో నివాళి


జ్యోతినగర్: నివాళి అర్పిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: వైఎస్సార్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పని చేయాలని బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దన్నాయక్ దామోదర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పించారు.
జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు ముచ్చకుర్తి రమేశ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.
పాలకుర్తి: మండలంలోని జీడీనగర్‌లో పార్టీ సీనియర్ నాయకులు తలారి శంకర్, కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య కేక్ కట్‌చేశారు.
కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నివాళి అర్పించారు.
మంథని: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు.
యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ మిఠాయిలు పంచారు.

తీరనున్న 'శవ పరీక్ష' కష్టాలు

- ఇటీవల జెడ్పీ సమావేశంలో లేవనెత్తిన ఎంపీపీ
- పూర్తి దశకు వచ్చిన మరమ్మతు పనులు
- నాలుగు మండలాలకు సౌకర్యం


మరమ్మతు పనులు జరుగుతున్న పోస్టుమార్టం గది

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం గది మరమ్మతు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయి. గత ఏడాది క్రితం వర్షానికి పై పెచ్చులు ఊడిపోగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గదిని ఉన్నతఅధికారుల ఆదేశం మేరకు స్థానిక డాక్టర్లు మూసివేశారు. గత నెల క్రితం జెడ్పీ సమావేశంలో సుల్తానాబాద్ ఎంపీపీ బాలాజీరావు స్థానికంగా పోస్టుమార్టం గది లేకపోవడం మూలంగా పలు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేవనెత్తారు. కలెక్టర్ సంగీత, ఉన్నతాధికారుల చొరవతో పోస్టుమార్టం గది మరమ్మతు పనులు పూర్తిదశకు వచ్చాయి. త్వరలో పోస్టుమార్టం చేసే అవకాశాలు ఉన్నట్లు డాక్టర్లు చెప్తున్నారు.

ఐదు మండలాల ప్రజలకు అందుబాటులో..
సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయం ఉంది. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడడం, వివిధ కారణాలతో ఆత్మహత్యలు, హత్యలు, దాడి జరిగినప్పుడు సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి వారిని తరలిస్తారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి పోస్టుమార్టం వినియోగించుకుంటారు.

జెడ్పీ సమావేశంలో చర్చించిన



ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో పోస్టుమార్టం గదికి మరమ్మతు చేయాలని అధికారులకు సమావేశంలో విన్నవించా. వెంటనే కలెక్టర్ సంగీత చొరవ తీసుకొని వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. మరమ్మతు పనులు జరుగుతున్నాయి.
– పి.బాలాజీరావు, ఎంపీపీ, సుల్తానాబాద్

పనులు పూర్తి దశకు వచ్చాయి



పోస్టుమార్టం గది మరమ్మతు పనులు పూర్తి దశకు వచ్చాయి. మండల ప్రజలకు, పట్టణ ప్రజలకు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చొరవతో ముందుకు సాగుతున్నాం.
– డాక్టర్ రమాదేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: దేశ ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ వరంగల్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనులపై నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి పోశం, రంగు శ్రీనివాస్, మదన, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మిత్రుల సాయం


సాయం అందజేస్తున్న మిత్రులు

జూలపల్లి: మండల కేంద్రానికి చెందిన ఆవుల ధనలక్ష్మి, ఆమె భర్త ఇద్దరూ దివ్యాంగులు. వీరు పేదరికంలో ఉన్నట్లు తెలుసుకున్న 1998–99లో కలిసి చదువుకున్న మిత్రులు రూ.11వేలు అందించారు. అదే గ్రామానికి చెందిన కైలాసం సునీత భర్త అనారోగ్యంతో మరణించగా 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.20వేలు జమ చేసి స్నేహితురాలికి అందజేశారు.

మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి


పోస్టుకార్డులతో సంఘం నాయకులు

మంథని: మున్నూరుకాపుల సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్క రామస్వామి కోరారు. పోస్టు కార్డు ద్వారా తమ డిమాండ్‌ను శనివారం సీఎం కేసీఆర్‌కు పంపించారు. మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్‌తో పాటు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. మంథని డివిజన్ అధ్యక్షుడు కిరణ్, నాయకులు రాజబాపు, శ్రీధర్ ఉన్నారు.

సాయిచంద్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న ఉద్యమకారులు

జూలపల్లి: ఉద్యమ కళాకారుడు సాయిచంద్ అకాల మరణం తెలంగాణకు తీరని లోటని ఉద్యమకారుల సంఘం మండల నాయకులు నాడెం మల్లారెడ్డి, అమరగాని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద శనివారం తెలంగాణ ఉద్యమకారులు, మహిళా ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు సాయిచంద్ మృతికి నివాళి అర్పించారు. ఉద్యమకారులు పాటకుల అనిల్, వైస్ ఎంపీపీ రమేశ్, ఎంపీటీసీలు దండె వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ సర్పంచులు బంటు ఎల్లయ్య, ఉపసర్పంచ్ తిరుపతి, పొట్టాల మల్లేశం, జెట్టి సతీశ్, పిల్లి భూమయ్య, పొలగాని సతీశ్, శ్యామల, సరళ, శారద పాల్గొన్నారు.

పెరటి మొక్కల పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని శాంతినగర్‌లో శనివారం మిరప, టమాట, వంకాయ మొక్కలను లయన్స్‌క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలోని ఖాళీస్థలాల్లో కూరగాయల పెంపకం చేపట్టడంతో కలిగే లాభాలను వివరించారు. ఇంటి ఆవరణలో పెరటితోట పెంపకం తప్పనిసరిగా చేపట్టాలని క్లబ్ ప్రెసిడెంట్ భిక్షపతి సూచించారు. సభ్యులు సంపత్‌రావు, పిట్ట వెంకటేశ్, అతిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ఆర్థిక చేయూత
ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన రాచకొండ రాయమల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబానికి కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జూలపల్లి జెడ్పీటీసీ పంపించిన రూ.5వేలు కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు దండె వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతల కాంతయ్య అందజేశారు. జిల్లా యూత్ అధ్యక్షుడు బొద్దుల సాయినాథ్, నాయకులు రాయనవేణి శ్రీనివాస్, జెట్టి సతీశ్, ఇరుగురాల రాజు, రాచకొండ లచ్చయ్య, పర్శరాములు పాల్గొన్నారు.

✦మల్లన్నస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే రాక
ఓదెల: ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో జరిగే పెద్దపట్నం, అగ్నిగుండ బ్రహ్మోత్సవాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్ శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉత్సవ మూర్తులను వేదికపైకి తీసుకురానున్నట్లు చైర్మన్ చెప్పారు. ఆదివారం రాత్రి జరిగే మల్లన్న పెద్దపట్నాలను, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తారని వివరించారు. పెద్దపట్నం బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో రావాలని కోరారు.

✦12న విద్యారంగ సమస్యలపై రాష్ట్రవ్యాప్త బంద్
గోదావరిఖనిటౌన్: విద్యారంగ సమస్యలపై 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు రేణికుంట్ల ప్రీతం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్ పాఠ్య పుస్తకాలు అందించాలని, ప్రతీ విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్ అందించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కమాన్‌పూర్: రాహుల్‌గాంధీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుట్రపూరితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం పీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీకి దేశ ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. సర్పంచ్‌లు కట్కం రవీందర్, ఆకుల ఓదెలు, నాయకులు గాండ్ల మోహన్, అన్వర్, భూంపెల్లి రాజయ్య, తిరుపతి, శ్రీనివాస్, శేఖర్, రాజయ్య, అప్సర్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం


ప్రొసీడింగ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

జూలపల్లి: గ్రామాల్లోని అన్ని సామాజిక వర్గాల ఆత్మగౌరవం పెంచేందుకే కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లెలో శనివారం యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షల సీడీపీ నిధులను మంజూరు చేస్తూ సంఘం సభ్యులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్‌తో కలిసి ప్రొసీడింగ్స్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజధానిలో అన్ని సామాజిక వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. గ్రామాల్లో అధిక నిధులు కేటాయించి సకల సౌకర్యాలు కల్పించినట్లు, ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో విశేష కృషి చేసినట్లు పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. ఎంపీటీసీ పల్లె శ్రీలత–ప్రసాద్, నాయకులు కంది చొక్కారెడ్డి, బడుగు ఈశ్వర్, మంద స్వామి, మల్లెత్తుల రాజయ్య, సతీశ్, మల్లయ్య, కొమ్మ మల్లేశ్, కొమ్మ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


పెద్దపల్లిరూరల్: సమ్మెలో ఐఎఫ్‌టీయూ నాయకులు


ధర్మారం: మద్దతు తెలుపుతున్న రవీందర్

ధర్మారం: గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్దెల రవీందర్ డిమాండ్ చేశారు. ధర్మారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు శనివారం కాంగ్రెస్ నాయకులు రవీందర్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

మూడోరోజు సమ్మె
పెద్దపల్లిరూరల్: మూడురోజులుగా పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు పంచాయతీ ఉద్యోగుల సమ్మెకు ఐఎఫ్‌టీయూ నాయకులు లింగమూర్తి మద్దతు తెలిపారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం నాయకులు శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్, రామస్వామి, సాకేత్, చందు మద్దతు తెలిపారు. పంచాయతీ ఉద్యోగసంఘ నాయకులు బాలసాని పరశురాం, మహ్మద్ ఖాజా, శేఖరయ్య, తిరుపతి, శారద, ప్రభాకర్, సత్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

జూలపల్లిలో..
జూలపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఎదుట వేసిన దీక్షా శిబిరంలో గ్రామాల నుంచి వచ్చిన కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. పురుషోత్తం, మధు, బాణయ్య, లచ్చయ్య, నాగయ్య, మల్లేశం పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు మద్దతు
ఎలిగేడు: మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మెకు శనివారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మద్దతు తెలిపారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజా, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షుడు తీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆసంపల్లి చంద్రయ్య, నాయకులు కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, కోంద్ర నర్సయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

జూలపల్లి మండలంలో భారీ వర్షం


అంబేద్కర్ చౌక్ వద్ద పడుతున్న వర్షం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరిమళ్ల దుక్కులను సిద్ధం చేసుకునేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుందని, మొలకెత్తని పత్తి విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తే అవకాశం ఉంటుందని రైతులు అన్నారు.

ఓదెలలో..
ఓదెల: మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. వర్షం పడడంతో పత్తి విత్తనాలు పెట్టిన రైతులు ఆనందంగా ఉన్నారు. మరోవైపు వరినాట్లు వేయటానికి రైతులు సమాయత్తం అవుతున్నారు.

ఆర్టీసీ టీ–9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ టీ–9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ కాల్వ అయిలయ్య కోరారు. బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీఎస్ ఆర్టీసీ టీ–9 పేరుతో నూతన టికెట్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, దీని ద్వారా 45 నుండి 60 కిలోమీటర్ల వరకు ఆర్డినరీ బస్సులో రూ.120 టికెట్ తీసుకుంటే రూ.20 రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ టికెట్ అన్ని ఆర్డినరీ బస్సుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఈ టికెట్ సౌకర్యం మహిళలతో పాటు 60ఏళ్లు దాటిన వృద్ధులకు కల్పించినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ వేణుగోపాలరావు, వార్డుసభ్యుడు తిరుమలాచారితో పాటు కొంకటి ప్రభాకర్, రహీం, సంపత్, కనుకయ్య, అనిల్, నవనీతరావు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తాం'


ఇంటింటికీ తిరిగి వివరిస్తున్న దాసరి ఉష

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పి హామీలకే పరిమితం చేశారని బీఎస్పీ ఆధ్వర్యంలో త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో 19వ రోజు మన ఊరు–మన ఉష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి హన్మయ్య, జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్, కోశాధికారి రియాజ్, మండల అధ్యక్షుడు రంజిత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రగతినగర్‌కు చెందిన తోపుడు బండి వ్యాపారి మద్రి శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆటోలో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని వారు తెలిపారు. వీధి దీపాలు లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికంగా ఉండే వారు చెప్తున్నారు.

మోదీ సభకు తరలిన బీజేపీ శ్రేణులు

ఎలిగేడు: వరంగల్‌లో శనివారం జరిగిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు ఎలిగేడు, బుర్హాన్‌మియాపేట, సుల్తాన్‌పూర్ నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. బీజేపీ యువమోర్చా నాయకులు గాదె రంజిత్‌రెడ్డి, కలకొండ విక్రమ్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాయపాక మనోహర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీజేవైఎం నాయకులు వ్యాట లక్ష్మన్‌రెడ్డి, మండల నాయకులు ఉన్నారు.
ఓదెల: మండలంలోని జీలకుంట, పొత్కపల్లి గ్రామాల నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తరలివెళ్లారు.